నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 1 ఏప్రిల్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

గద్వాల : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మీకు అండగా నేనుంటా..

- సేవ చేసే అదృష్టం కల్పించండి
- సీఎం ప్యాకేజీలతో వల వేసి ఇతర పార్టీలనే తలను కాంగ్రెస్‌లోచే ర్చుకుంటుండ్రు
- ఆరు గ్యారెంటీలుఅ మలు చేయమంటే కేసులు పెడుతుండ్రు
- ప్రజలుఅ భివృద్ధి వైపో అవినీతివైపో తేల్చు కోవాలి
- బీఆర్ఎస్‌నా గర్‌కర్నూల్ పార్లమెంట్‌అ భ్యర్థి ఆర్ఎస్‌ప్రవీ ణ్‌కుమార్
- కాంగ్రెస్‌కు ఓటు వేసి ప్రజలు గోసపడు తున్నారు
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మార్చి 31: మీకు అండగా నేనుంటాను.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి గెలిపించి మీకు సేవ చేసే అదృష్టం కల్పించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కార్యకర్తలను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేయగా బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. రాష్ట్రం లో రైతన్నలు తాగు, సాగునీటికి నోచుకోక కరెంట్ రాక తమ పొలాల్లో కన్నీరు కార్చుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవేమీ పట్టించుకోకుండా కేకే ఇంటికి, ఢిల్లీకి పోతున్నారని ఎద్దేవా చేశారు. రైతుల కోసం కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం బాగా లేకున్నా రైతుల కష్టాలు తెలుసుకుంటున్నాడని ఇది చూసి ముఖ్యమంత్రి బుద్ధి తెచ్చుకోవాలన్నారు. 70ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ఏనాడూ నడిగడ్డలో విద్య, వైద్యం గురించి ఆలోచించలేదన్నారు. రాష్ట్రం సిద్ధించిన పదేండ్ల కాలంలోనే గద్వాలకు నర్సింగ్, మెడికల్ కళాశాలను కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసి విద్యాభివృద్ధికి కృషి చేసిందన్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా నడిగడ్డను బీఆర్ఎస్ సస్యశ్యామలం చేసిందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు నన్ను ప్రలోభాలకు గురి చేశారని నడిగడ్డ బిడ్డలు ప్రలోభాలకు లొంగరని చెప్పారు. కొందరు సన్నాసులు, స్వార్థ పరులు ఆర్ఎస్ బహుజన ద్రోహి అం టున్నారని వారికి ఇదే నా సమాధానమన్నారు. బహుజన ద్రోహినైతే పది లక్షల మంది విద్యార్థులకు ఆంగ్లబోధన చేయించి సుమారు 400మంది విద్యార్థులకు పైగా డాక్టర్లను తయారు చేశానని బహుజన ద్రోహినైతే నా స్వార్థం నేను చూసుకుంటా కదా.. కానీ ప్రజల కోసం ఎందుకు సేవ చేస్తానని ప్రశ్నించారు. నాకు డీజీపీ స్థాయి అయ్యే వరకు అర్హత ఉన్నా ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలేసి బహుజనుల కోసం పోరాటం చేస్తున్నాని తెలిపారు. సమాజం కన్నీళ్లు తుడవడానికి రాజకీయాల్లోకి వచ్చానే తప్పా మరోటి లేదన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కొందరు ద్రోహులు కాంగ్రెస్ మాయలో పడి పార్టీని వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్నారని వారికి ప్రజలు త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ బరిలో నిలిచిన పార్ల మెంట్ అభ్యర్థులు తెలంగాణ సంపదను దోచి ఢిల్లీ పెద్దల ముందు ఉంచడానికి బరిలో నిలుస్తున్నారని చెప్పారు. ప్రజలు అభివృద్ధివైపు ఉంటారో అవినీతి పైపు ఉంటారో తేల్చుకోవాలని సూచించా రు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల పట్టుకొని ప్యాకేజీలు ఇస్తూ బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి చేరికలపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదన్నారు. ముఖ్యమంత్రికి పాలన చేతకాక, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక వాటిని అమలు చేయాలని అడిగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. మీకు పాదాభివందనం చేస్తున్నా నడిగడ్డ బిడ్డగా పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి తనను గెలిపించాలని ఆర్ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజలు గోస పడుతున్నారు : ఎమ్మెల్యే బండ్ల

గతంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచిన రాములు పార్టీకి ద్రోహం చేశారని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. నడిగడ్డ నుంచి అధిక మెజార్టీ ఇస్తే ఏనాడు నడిగడ్డ సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని చెప్పారు. ఎన్నికల్లో నా విజయానికి ఎలా కృషి చేశారో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ఒక్కో క్కరు రెండు వందల ఓట్లు వేయించి లక్ష మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ మరో సారి మోసపూరిత మాటలు ప్రజలకు చెప్పి గెలుపొందాలని చూస్తుందని వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం తన స్థాయి దిగజారి మాట్లాడుతున్నారన్నారు. పాలన పక్కన పెట్టి దోచుకొని దాచుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు నమ్మి ఓట్లు వేసి మోసపోయి ఇప్పుడు గోస పడుతున్నామని అంటున్నారని మరోసారి కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని వేస్తే గోస తప్పదన్నారు. గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తో సాధ్యమైందన్నారు. 100 రోజుల కాంగ్రెస్ పాలన బీఆర్ఎస్ నాయకులను తిట్టడానికి, వారిని పార్టీలో చేర్చుకోవడానికి సరిపోయిందన్నారు. ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మకుండా ఆలోచించి ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అభిలాష్‌రావు మాట్లాడుతూ గత ఎంపీ తల్లిపాలు తాగి రొమ్ముగుద్ది బీజేపీలో చేరాడని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరువు వచ్చిందన్నారు. పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. పార్టీకి కష్టకాలంలో అండగా ఉన్న వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గద్వాలలో నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సన్నాహక సమావేశానికి హాజరైన కార్యకర్తలు

ఉత్కంఠ

- ఐదు టేబుళ్ల వారీగా లెక్కింపు
- రెండు గంటల్లో రిజల్ట్
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- కౌంటింగ్ సిబ్బందితో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి సమీక్ష

మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ శిక్షణకు హాజరైన కౌంటింగ్ సిబ్బంది, అధికారులు

- బ్యాలెట్ బాక్స్‌ల్లో అభ్యర్థుల భవితవ్యం
- రేపే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితం

పారదర్శకంగా నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి రవినాయక్

మహబూబ్‌నగర్, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి రవినాయక్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో సిబ్బందికి శిక్షణ, కౌంటింగ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8 గంటలకు మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. సిబ్బంది 6:30 లోగా రిపోర్టు చేయాలని ఆదేశించారు. సిబ్బంది కౌంటింగ్ టేబుల్స్ వద్ద ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపును ప్రారంభించాలని, ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని ఎంపిక చేస్తారన్నారు. 7:30 గంటలకు స్ట్రాంగ్ రూం తెరిచి బ్యాలెట్ బాక్సులు కౌంటింగ్ హాల్‌కు తీసుకురావాలన్నారు. ప్రారంభ లెక్కింపులో 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కిస్తారని, ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. అనంతరం మొత్తం చెల్లుబాటు అయిన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావాల్సిన కోటాను నిర్ధారిస్తామన్నారు. అభ్యర్థి కోటాకు సరిపడా ఓట్లను సాధిస్తే గెలుపొందినట్లుగా ప్రకటిస్తామన్నారు. ఏ అభ్యర్థికీ కోటాకు కావాల్సిన ఓట్లు రాకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్ల లెక్కింపు జరుపుతామన్నారు. ఈ ప్రక్రియ అభ్యర్థి కోటాను సాధించేవరకు చేపడతామన్నారు. ఏ అభ్యర్థికీ కోటా రాన ట్లయితే చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మయాంక్ మిట్టల్, మోహన్‌రావు, డీఆర్‌వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మలుపు తిప్పే అంశంగా మారనున్న ఎమ్మెల్సీ ఫలితం

మహబూబ్‌నగర్, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ శాసనమండలి ఉపఎన్నిక ఫలితాలు మరో 24 గంటల్లో వెలువడనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నిక రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్నది. ఫలితాలపై అధికార పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ గెలుపు ధీమాతో ఉన్నాయి. కాగా ఈ ఉపఎన్నిక ఫలితాలు పార్లమెంట్ ఎన్నికలను ప్రభావితం చేసేలా కనిపిస్తున్నాయి. ఉపఎన్నిక ఫలితాలు నిలిపివేస్తారని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత లెక్కింపు చేపట్టే అవకాశం ఉందని పుకార్లు వ్యాపించాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ అధికారులు మంగళవారం ఎన్నికల ఫలితాలను వెల్లడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్ కౌంటింగ్ సిబ్బందితో సమీక్షించారు. కౌంటింగ్ నిర్వహించే బాయ్స్ కాలేజ్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుండగా ఆ ప్రక్రియ ముగిసే వరకు పాలమూరులో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఆయా రాజకీయ పక్షాలు ఫలితాలపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఐదు టేబుళ్లు.. రెండు గంటల్లో ఫలితం

కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్ పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ జరిగే బాయ్స్ కాలేజీలోని హాల్లో ఐదు టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం 7:30 తర్వాత స్ట్రాంగ్ రూంలను తెరిచి బ్యాలెట్ బాక్స్‌లను ఒక్కొక్కటిగా తీసుకొచ్చి లెక్కించి పక్కకు పెడతారు. ఆ తర్వాత అన్నింటినీ కలిపి ఒక్కో టేబుల్ ద్వారా లెక్కిస్తారు. అభ్యర్థులకు వచ్చిన ప్రాధాన్యత ఓట్లను లెక్కించి గెలుపునకు సంబంధించిన పర్సంటేజీని చూస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్లలోనే గెలుపు ఖాయం అనిపిస్తే అప్పటికప్పుడే ఫలితాన్ని ప్రకటిస్తారు. ఒకవేళ తొలి ప్రాధాన్యత ఓట్లలో ఎలిమినేషన్ రౌండ్ ప్రారంభమైతే క్యాండిడేట్ ఎలిమినేషన్ అయ్యాక ఆ ప్రాధాన్యత ఓట్లను లెక్కించి తుది ఫలితాన్ని వెల్లడిస్తారు. ఈ ప్రక్రియ రెండు గంటల్లో ముగిసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

మహబూబ్‌నగర్ శాసనమండలి ఉపఎన్నిక తీవ్ర ఉత్కంఠగా సాగింది. ఈ ఫలితం రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పే అంశంగా మారనున్నది. అధికార మార్పిడి జరిగాక వచ్చిన తొలి ఎన్నిక కావడం, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో అందరి దృష్టి ఎమ్మెల్సీ ఫలితంపైనే ఉన్నది. ఉమ్మడి జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధులు మొత్తం 1,439 మంది ఉండగా ఇందులో దాదాపు 70 నుంచి 80 శాతం బీఆర్ఎస్ తరపున గెలిచిన వారే. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం మారడంతో చాలామంది జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పార్టీలు మారారు. అయినప్పటికీ మెజారిటీ ప్రజాప్రతినిధులు తమ వైపే ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఏకంగా క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో గెలుపు కోసం అవసరమైన ప్రజాప్రతినిధులు ఉన్నారనే ధీమాలో ఉన్నా రు. గోవాలో నిర్వహించిన క్యాంప్‌నకు ఏకంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లి ప్రజాప్రతినిధులను కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నది. దీంతో అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టాయి. ఫలితం తేడా వస్తే అధికారం వ చ్చిన కొన్నాళ్లకే వ్యతిరేకత ప్రారంభమైందనే సంకేతం వె ళ్తుందని ఆ పార్టీ నేత లు భయపడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి గెలుస్తామనే ధీమాలో కాంగ్రెస్ నేతలు ఊహల్లో తేలాడుతున్నారు.

అలంపూర్‌కు సరికొత్త అందాలు

అలంపూర్‌లో ముస్తాబైన అతిథిగృహం

- శక్తిపీఠంసము దాయంలో పర్యాటక సొబగులు
- రూ.36కోట్ల నిధులతో పనులు
- చివరి దశకు చేరుకున్న పనులు

అలంపూర్, మార్చి 31 : ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయ సముదాయం సరికొత్త సొగబులు సంతరించుకోనున్నది. ప్రసాద్ స్కీం పథకంలో ఆలయ సముదాయంలోని 3ఎకరాల 5గుంటల విస్తీర్ణంలో రూ.36కోట్లతో నిర్మిస్తున్న టూరిజం గెస్ట్‌హౌస్‌తో అలంపురం క్షేత్రంలో పర్యాటకంగా అభివృద్ధి చెందనున్నది. నడిగడ్డలో ఇది వరకు ఎన్నడూ లేని విధంగా అత్యధిక నిధులతో నిర్మిస్తున్న గెస్ట్‌హౌస్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పర్యాటక క్షేత్రాల్లో రాష్ట్రంలోనే అలంపూరు అగ్రగామిగా నిలువనున్నది.

అభివృద్ధి పనులు ఇలా..

ప్రసాద్ స్కీం కింద 21 గదులతో అధునాతనమైన మూడంతస్తుల భవనం, ఒక ఫ్లోర్‌లో కల్యాణ మండపం, ఇంకో ఫ్లోర్‌లో ఆర్ట్ గ్యాలరీ, మరో ఫ్లోర్‌లో మల్టీ మీడియా కాన్ఫరెన్స్ హాల్, 14 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్, కల్చరల్ యాక్టివిటీస్ కోసం సుమారు 400 మంది ప్రేక్షకులకు అనుగుణంగా మినీ హాల్, పర్యాటకుల కోసం తుంగభద్రానదిలో బోటింగ్ సౌకర్యం, మినీ బస్టాండ్‌తోపాటు జోగుళాంబ, సంగమేశ్వర ఆలయాలు, బస్టాండ్, ప్రసాద్ స్కీం గెస్ట్‌హౌస్ వద్ద మొత్తం ఏడు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.

నిధులు మంజూరు..

కేంద్ర ప్రభుత్వం 2021 సంవత్సరంలో ప్రసాద్ స్కీం పథకం కింద రూ.37కోట్లు, 2022లో రామప్ప ఆలయానికి రూ.62కోట్లు, 2023లో భద్రాచలం ఆలయానికి రూ.42కోట్లు నిధులు మంజూరు చేసింది. అలంపూర్‌కు ప్రసాద్ స్కీం పనులు 2021లో రూ.36.73కోట్లు నిధులు మంజూరు కాగా, మే 2021లో టెండర్లు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 2021లో కేపీసీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వారు పనులు ప్రారంభించారు. డిసెంబర్ 2023 వరకు పూర్తి కావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల కొంత ఆలస్యం జరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. నెలాఖరు వరకు పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు పర్యాటక శాఖ డీఈ ధన్‌రాజ్, సైట్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు.

రంజాన్ స్పెషల్

మహబూబ్‌నగర్‌లో హలీస్ విక్రయిస్తున్న నిర్వాహకులు

ఆహా.. హలీస్

- నోరూరిస్తున్న రంజాన్ ప్రత్యేక వంటకం
- రుచితోపాటు ఆరోగ్యానికి మేలు
- కిటకిటలాడుతున్న విక్రయ కేంద్రాలు

హలీస్.. ఈ పదం వింటే చాలు ఇట్టే నోరూరుతుంది. రంజాన్ మాసంలో తయారు చేసే ఈ వంటకానికి ఎంతో ప్రత్యేకత ఉన్నది. పొట్టేలు మాంసం లేదా చికెన్‌తో పాటు నెయ్యి, గోధుమ, రవ్వతో తయారు చేసే ఈ వంటకం పోషకాహారం కావడంతో కేవలం ఉపవాస ప్రార్థనలు చేసే ముస్లింలే కాకుండా అన్నివర్గాల ప్రజలు రుచి చూసేందుకు తహతహలాడుతారు. ప్రజల అభిరుచికి అనుగుణంగా వివిధ హోటళ్లలో ప్రత్యేకమైన వంటకాలను తయారు చేసి జోరుగా విక్రయాలు చేస్తున్నారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సాయంత్రం అయ్యిందంటే చాలు హలీస్ దుకాణాలు కిటకిటలాడిపోతున్నాయి.

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 31 : ఒకప్పుడు హైదరాబాద్ వంటి మహానగరానికే పరిమితమైన ఈ ఇరానీ వంటకం.. నేడు అన్ని పట్టణాలకు వ్యాపించింది. ముఖ్యంగా రంజాన్ మాసంలో తయారు చేసే, హలీం, హరీస్‌లకు భలే గిరాకీ. బలమైన ఆహారంగా భావించి రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసే వారు ఈ వంటకాన్ని ఆరగించేందుకు ఇష్టపడుతున్నారు. కేవలం ముస్లింలే కాకుండా అన్నివర్గాల ప్రజలు ఈ హరీస్‌ను తినేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఈ ఏడాది పెద్ద సంఖ్యలో హరీస్ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే దాదాపు 40కిపైగా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మటన్ హలీం ప్లేట్ రూ.200 నుంచి రూ.270 వరకు, చికెన్ హలీం రూ.70 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. ఆపర్లతో జోరుగా అమ్మలు సాగిస్తున్నారు.

40 ఏళ్ల నుంచి విక్రయం

40 ఏండ్ల నుంచి మా కుటుంబం హోటల్‌తోపాటు హరీస్ సెంటర్ నడుపుతున్నాం. మటన్ హరీస్ ఒకటి కొంటే ఒకటి ఉచితంగా ఇస్తున్నాం. హరీస్ రుచితోపాటు పోషకాహారం అందిస్తుంది. ఈ ఏడాది హరీస్ సెంటర్లు పెరగడంతో పోటీ పెరిగింది. మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరలు ఉన్నాయి.

– మహ్మద్ బురాన్, నయాబ్ హలీస్ సెంటర్

ఉత్సాహంగా కిక్‌బాక్సింగ్ టోర్నీ

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 31 : మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలను ప్రిన్సిపాల్ శాంత ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని.. క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ కిక్‌బాక్సింగ్‌లో క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధిస్తున్నారని తెలిపారు. పోటీల్లో 50మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రవినాయక్, సలహాదారుడు విజయ్‌కుమార్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

రూ.3.74లక్షలు సీజ్

రాజాపూర్, మార్చి 31 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జాతీ య రహదారిపై పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ వాహనంలో ఎలాంటి బిల్లు లు లేకుండా తరలిస్తున్న రూ. 2.39 లక్షల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై రవి తెలిపారు. ప్రజలు రూ.50వేలకు మించి నగదును తరలిస్తే వాటికి సంబంధించిన ఆధారాలు ఉంచుకోవాలని ఆయన సూచించారు.

బుద్దారం వద్ద రూ.1.35లక్షలు..

గోపాల్‌పేట, మార్చి 31 : మండలంలోని బుద్దారం గండి చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని అమడాలకుంట తండాకు చెందిన వత్యావత్ బాషానాయక్ బైక్‌పై వెళ్తుండగా అతడి వద్ద రూ. 1.35లక్షలు గుర్తించారు. అందకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

రాజాపూర్ వద్ద సీజ్ చేసిన నగదుతో పోలీసులు

హలీస్ తింటున్న యువకులు